

# సర్పశిల

## – భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

ఇప్పటివరకూ జరిగిన కథ

ఎపిసోడ్ ఆ: (జనవరి)

శృంగి, మట్టు అడవిలో నడుస్తూ ఓ శిథిలాలయానికి చేరుకుంటారు శృంగి బ్రాహ్మణుడు. మట్టు భిల్లుడు. ఆ ఆలయంలో ఆ8 చేతులు గల నిలువెత్తు అమ్మవారు. తిరిగి వచ్చేప్పుడు ఓ భయంకరమైన పాము తోక మీద నిలబడి వారిని అడ్డగిస్తుంది. శృంగి స్పృహ తప్పుతాడు.

ఎపిసోడ్: 2 (ఫిబ్రవరి)

రాబీ వెబ్‌స్టర్ అనే అమెరికన్ ని జయదేవ్ ఏర్‌పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాడు. ఆ రాత్రి రాబీ(రాబర్ట్)కి విలియమ్స్ అనే ఆత్మ కనిపిస్తుంది. జయదేవ్ రాబీని తిరుపతి పంపుతూ డ్రైవర్ని చూస్తాడు. ఆ డ్రైవర్ అచ్చు రాబీ వర్ణించిన విలియమ్స్ పోలికతో వుండడం జయ్‌ని విస్మయానికి గురిచేస్తుంది.

ఎపిసోడ్: 3 (మార్చ్)

శృంగి, మట్టూ రామజోగినీ, మధురనీ కలుస్తారు. పాము విషయం మట్టు రామజోగికి వివరిస్తాడు.

జర్నీలో రాబర్ట్ విలియమ్స్‌లా వున్న డ్రైవర్‌తో సంభాషిస్తాడు. శ్రీనివాస్ రాబీని రిసీవ్ చేసుకుంటాడు. రాబీ హోటల్ గదిలో కళ్ళు తిరిగి పడిపోతాడు.

ఎపిసోడ్ 4: (ఏప్రెల్) తక్ష పురం గురించి రామజోగికి వర్ణిస్తాడు మట్టూ. రాబీకి స్పృహ వస్తుంది. శ్రీనివాస్‌తో గోవిందరాజస్వామి ఆలయంలోకి అడుగుపెట్టి చిత్రంగా ఆ గుడంతా పరిచయం ఉన్నట్టు నడుస్తూ తెలుగు మాట్లాడతాడు. స్వామిని చూచి గట్టిగా అరిచి స్పృహ తప్పుతాడు రాబీ. షోలింగర్‌లో జయదేవ్, సుదర్శన్ భట్టాచార్య రాబీ గురించి డిస్కస్ చేస్తారు. రామజోగి మధురని సముదాయిస్తాడు. రాబీ స్పృహలోకి వచ్చి శ్రీనివాస్‌తో విలియమ్స్ గురించి చెబుతాడు.

ఎపిసోడ్:5 (మే) జయ్ శ్రీనివాస్ రాబీ గురించి శాస్త్రిగారితో డిస్కస్ చేస్తారు.

ఎపిసోడ్:6 (జూన్) అందరూ, అంటే జయ్, రాబీ, శ్రీనివాస్, శాస్త్రిగారూ, సుదర్శన్ రెండు కార్లలో పలమనేరు వైపుకి బయల్దేరతారు. శ్రీనివాస్ సామాన్లతో రెండో కారులో ఉంటాడు. వారణాసి, మోహన్ గిరి, కిషన్ బైరాగి గంగాతీరాన పరిచయం అవుతారు. కిషన్ హిందూ మతం వదిలి ఫకీర్‌కి శిష్యుడవుతాడు. ఫకీర్ కిషన్‌కి 'బిదాసీ' అనే శక్తిని చూపుతాడు.

ఎపిసోడ్ 7: (జూలై)

తక్షపురానికి ఓ ముసలిది వస్తుంది. ఆమెకీ సర్పశిలకీ సంబంధం ఏదో ఉందని జనాలు రకరకాలుగా ఊహిస్తుంటారు. ఆలయ పూజారి, ప్రవచకుడూ, ప్రెసిడెంటూ డబ్బులు దండుకునే ఆలోచనలు చేస్తూంటారు. జయ్, శాస్త్రిగారు, రాబీ, సుదర్శన్‌లు వెడుతున్న కారు రోడ్డు పక్కకి పడిపోతుంది.

ఎపిసోడ్ 8 (ఆగస్టు) పెద్ద పుల్లేటి కుర్రు ఆశ్రమంలో కన్యాదేవి, మాయాదేవి మరో పదహారుమంది ఉంటారు. వారిని అక్కడికి పంపింది నిశ్చలానంద (వారణాసి) అవధానీ, హనుమంతు ఆశ్రమం గురించి మాట్లాడుకుంటారు. విలియమ్స్ తూఫానులోనించే శ్రీనివాస్‌తో ఆహారం జలం మొదటి కారు వాళ్ళకి పంపుతాడు.

మట్టూతో బాటు శృంగిని కూడా శిథిలాలయానికి వెళ్ళమని ఆదేశిస్తాడు రామజోగి.

ఎపిసోడ్ 9 (సెప్టెంబర్)

ప్రకృతి ప్రేమికులు, రక్షకులు దేవతలు.

ప్రకృతి నాశకులు రాక్షసులు

ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. మదాలస హార్స్‌లీ హిల్స్ గురించి సుదర్శన్‌కి వివరిస్తుంది. యజ్ఞనారాయణగారు శాస్త్రిగారు జరుగుతున్న సంఘటనల గురించి చర్చిస్తారు.

ఎపిసోడ్ --0

అవధాని హనుమంతుని హెచ్చరిస్తాడు.అవధాని పాములు లలలోకి రావడం గురించి సూరయ్యగారికి చెబుతాడు .తక్షపురంలో ముసలిది శాపాలు పెడుతూ వికటాట్ట హాసం చేస్తుంది.

తరువాయి భాగం చదవండి ...

**ఆ అడవి నిర్మాణమే** విచిత్రంగా ఉంది. కొన్ని వేల ఎకరాల గుడిసెను వేసినట్లుంది. గుడిసె అంటే గుడిసె కాదు. వృత్తాకారంలో వున్న గుడెసె ఆకారం. నిజం చెబితే రకరకాల ఎత్తుల్లో వున్న చెట్ల చేతనే ఆ ఆకారాన్ని సృష్టించారా అనిపిస్తుంది. మూడడుగుల చెట్లు 4,5,6 ఇలా రకరకాల ఎత్తుల్లో చెట్లు, అవి ఇప్పుడు మహావృక్షాలుగా మారి ఇలా యీ ఆకారాన్ని సంతరించుకున్నాయా అనిపిస్తుంది. ఏమైనా లోపలికి వెడితే పసిరిక, కొండలు, లోయలు మొక్కలు, చెట్లు, వృక్షాలు. అడవి జంతువులు యధేచ్ఛగా తిరుగుతున్నాయి. అదివాటి స్వస్థలం. ఎప్పుడోగానీ ఆ అడవిలోపలికి వెళ్ళే సాహసం చెయ్యరు. ఎందుకంటే అదో వింత ప్రపంచం.

"మనుషులకి నియమాలు లేవు. ఉన్నా పాటించరు. అడవి జంతువులకు నియమాలు లేనేలేవు. అవి కాల నియమాల్ని పాటిస్తాయి. రుతు నియమాల్ని పాటిస్తాయి. అందుకే అవి సృష్టిలో తమదైన ప్రత్యేకతతో మనగలుగుతున్నాయి. అడవిలో ఏ జంతువూ మరో దానికి బానిసా కాదు యజమానీ కాదు. ఏ జంతువూ ఎవరి దయాధర్మాల కోసమూ పాకులాడదు. మనుషులు అలా కాదు. అందుకే బుద్ధి జీవుల బుద్ధి వక్రించి సృష్టిని మహా ప్రళయాలకి గురిచేస్తోంది. ఓయీ నేనెవరని అడక్కు. నేనో సాక్షిని. నాకేదీ అంటదు. నా పేరు అలంబస భరద్వాజుడు. అదో పేరు మాత్రమే. ఈ నామం ఎన్నోసారి నన్ను వరించిందో కూడా నాకు తెలీదు. అసలు ఎందుకు తెలియాలీ? ఈ విశ్వశాంతి యజ్ఞంలో నేను పాలు పంచుకోవాలని నిర్ణయింపబడింది. ఎవరా నిర్ణయించింది? నాకు తెలీదు. ఇదిగో యీ అరిదమనుడున్నాడే - మహా విజ్ఞాని. అరిదమనుడు అంటేనే శత్రువుని నిర్జించేవాడని అర్థం. ఈయనకి శత్రువులెవరూ? పేరు అరిదమనుడు. చాలా లోతైన వాడు. నా దగ్గర కొచ్చి ఓ యజ్ఞంలో పాల్గొనాలని అర్థించాడు. అదేమి చిత్రమో. నేను మహా మొండివాణ్ని. అయినా అంగీకరించాను. అసలు సంగతి ఏమిటో తెలుసునా? కలిసినప్పుడు ఇద్దరమూ అపరిచితులమే. ఆ కలిసినన క్షణం ఎటువంటిదో కానీ జన్మ జన్మల పరిచయం ఉన్నట్టు మాట్లాడుకున్నాం. అసలీ అడవి ఎప్పటిదీ? ఇది నిర్మించబడ్డ అడవా సహజవనమా? ఏమీ తెలీదు. కానీ మాకు ఇది చిరపరిచితంగా గోచరించింది." ఆగాడు అలంబసుడు. నీలుడు, మట్టు, వటువులు, శిష్యులూ, సంకల్పానందతో సహా అందరూ అతని మాటలు వింటున్నారు.

"అసలు యుగాంతం ఎలా సంభవిస్తుందీ? ప్రతి యుగం పుట్టినప్పుడు ఎంతో చక్కగా ధర్మంతో సత్యంతో శాంతితో ప్రేమలో మనిషి బాల్యంలాగా ఆహ్లాదాన్నీ ఆందాన్నీ వెదజల్లుతుంది. పిల్లలకు పళ్ళు వచ్చినప్పుడు చివురించి పెరిగే స్వార్థంలాగా యుగమూ ఎదిగిన కొలదీ కొన్ని స్వార్థ లక్షణాలను పుణికిపుచ్చుకుంటుంది. యవ్వనంతో మదించిన ఏనుగులాగా సంచరించి ప్రకృతి మీద ఆధిపత్యం చెలాయిస్తుంది. పదవులు, రాజ్యాలు, సుఖాలు, భోగభాగ్యాలూ అన్నీ మనిషినీ మనసునీ అహంకారపూరితుణ్ని చేసినట్టుగానే యుగము గడిచిన కొలదీ తామస గుణాన్ని సంతరించుకుంటుంది. ఇక వృద్ధాప్యదశ. శరీరం క్షీణించినట్టుగానే యుగమూ క్షీణించి ధర్మాన్నీ సత్యాన్నీ శాంతినీ విస్మరించి వృద్ధులు మితిమీరిన జాగ్రత్తలు తీసుకున్నట్టుగా స్వార్థాన్ని వెర్రితలలు వేయిస్తుంది. అప్పుడు అధర్మం, అశాంతి అసత్యం చెలరేగి హింస మితిమీరి తనని తనే సర్వనాశనం చేసుకుంటుంది. సత్యహరిశ్చంద్రుడు ఎందుకు గొప్పవాడయ్యాడు? అతని సమయంలో సత్యానికి విలువేలేదు గనకే, అతడొక్కడే సత్యాన్ని మనోవాక్కాయ కర్మణా పాటించాడు గనక. శ్రీరాముడు ఎందుకు గొప్పవాడయ్యాడు? ధర్మం నశించింది. ప్రజల దారి ప్రజలదీ ప్రభువు దారి ప్రభువుది!! అప్పుడు రాముడొచ్చాడు. యధారాజా తథాప్రజ అని ఆదర్శవంతుడైన రాజుగా తనని తాను తీర్చిదిద్దుకుని, ప్రజలను ఆదర్శవంతులుగా మార్చాడు.

తండ్రి మాటని తాను స్వచ్ఛందంగా పాటించి ఇతరులకు మార్గదర్శి అయినాడు. ఏకపత్నీవ్రతాన్ని స్వయంగా ఆచరించి ప్రజలకు ఆదర్శవంతుడు అనుసరణీయుడు అయ్యాడు.

మరి ఆ తరవాత? త్రేతాయుగ ధర్మం క్షీణించి ద్వాపరయుగం వచ్చింది. ద్వాపరలో ఏం జరిగిందో మీకందరికీ తెలుసు. ఇది కలి. ఈ కలి ధర్మం మహా విచిత్రమైనది" గుక్క తిప్పుకోకుండా చెప్పి ఆగాడు అలంబసుడు.

"అమ్మయ్య. అలంబసా.. మంచి విషయాలు చెప్పావు. అయినా ఈ విశ్వశాంతి యాగం, యీ అడవి, మీ రాక గురించి కొంచెం స్పష్టంగా చెప్పు" అనీషుడనే ఓ రుషితుల్యుడు అన్నాడు అలంబసునితో.

"అడిగిన ప్రశ్న చిన్నదే అనీషా. కానీ ఆ ప్రశ్న కాల సంబంధి. యుగ సంబంధి. రామరావణ యుద్ధంలో పాల్గొన్నదెవరూ? రాక్షసులు వానరులుగా పిలవబడే వనరులు. అందులో సామాన్య జనాలు పాల్గొనలేరు. మహా భారత యుద్ధంలో పాల్గొన్నది ఎవరూ? రాజులూ, సైనికులూ. పద్దెనిమిది అక్షౌహిణీల సేన, రాజులూ, సైనికులదే. ఘటోత్కచుడు, ఇరావంతుడు, శకుని, నాపేరే గల అలంబసుడూ పాల్గొని మాయా యుద్ధం చేశారు. అది వేరే కథ. అయినా వారూ యుద్ధరంగంలో గల రాజపుత్రులూ వారి అనుయాయులే. అక్కడా సామాన్యులు యుద్ధంలో పాల్గొన లేదు. సామాన్యులకి యుద్ధంతో, యుద్ధం వల్ల ఏ అసౌకర్యమూ కలగకుండా ఉండటానికీ యుద్ధభూమిగా కురుక్షేత్రాన్ని ఎంచుకున్నారు.

సరే. ఇప్పుడీ కలియుగంలోని ప్రజలు ఎవరు? ఎక్కడినించి పుట్టుకొచ్చారు? "ఉన్నవాళ్ళు చనిపోకుండా కొత్తవారు జన్మించడానికి యుద్ధభూమి ప్రసూతి గృహంకాదు గదా" అంటాడు భీముడు ధర్మరాజుతో. ఆ మాట నిజమే. మహా రామరావణ యుద్ధంలో మృతులైన వారు మరల మరల జన్మిస్తూ ద్వాపరలో కౌరవ, పాండవ యుద్ధంలో ఒకరి నొకరు చంపుకున్నారు. యీ వైరం పురాణ వైరం. ఇప్పుడీ కలియుగ వినాశకులు ఎప్పటివారూ? యుగయుగాల మూలాలలో పుట్టినవారు. రామరావణ యుద్ధంలోనూ, మహా భారత యుద్ధంలోనూ ఎన్ని రకాల అస్త్రాలు వాడబడ్డాయో, కనిపెట్టబడ్డాయో, యీ కలియుగంలోనూ అన్ని అస్త్రాలూ వున్నాయి. నిజం చెబితే ఇంకా భయంకరమైనవి వున్నాయి. అయితే పేరు మార్చుకున్నాయి" ఆగాడు ఆలంబసుడు.

"అయితే యీ విశ్వానికి చేటు కాలం రాబోతోందా? శాంతికీ ధర్మానికీ" నవ్వాడు అలంబసుడు. అందరూ మౌనముఖాలయ్యారు. చర్చ ఎక్కడో మొదలై ఎటెటో పోతోంది. హెచ్చరించేవారు ఎవ్వరూ?

"మీ మనసుల్లో ఏం తిరుగుతోందో నాకు తెలుసు. సరే.. గుప్పెట తెరుస్తాను. నా పూర్వజన్మ రహస్యం నాకు తెలుసు. ఆ జన్మలోనూ నా పేరు అలంబసుడే ఆ జన్మలో నా తండ్రి పేరు రుష్యశృంగుడు. నేను పుట్టుకతో బ్రాహ్మణుడనైనా ప్రవృత్తిలో క్షత్రియుడిని. నా తండ్రి రామాయణ కాలపు రుష్య శృంగుడు కాదు. ద్వాపర యుగపు రుష్యశృంగుడు. నేను కత్తి యుద్ధం, విలువిద్య, కొంత గదా యుద్ధం మాత్రమే కాక జనాల్ని మంత్రముగ్ధుల్ని చేసే మాయాజాలాన్నీ నేర్చుకున్నాను. మాయాజాలం దేన్నీ కొత్తగా సృష్టించదు. ఉన్నది లేనిదిగా, లేనిది ఉన్నదిగా భ్రమకల్పిస్తుంది. ఘటోత్కచుడూ, ఇరావంతుడూ నేనూ కూడా ఆ మాయా విద్యలో సమ ఉజ్జీలమే. అయితే జన్మతః బ్రాహ్మణుడ్ని కనక కొంత మెత్తదనం, కొంత పిరికిదనమూ పుట్టుకతోనే వచ్చాయి. కురుపాండవ యుద్ధంలో ఇరావంతుడితో పోరాడాను. అభిమన్యుడితో భయంకరంగా పోరు సాగించాను. ఆ బాలుడు సూర్యాస్త్రాన్ని సంధించగా తట్టుకోలేక పారిపోయాను. అప్పుడేకాదు, అంతకుముందు సాత్యకితో తలపడి పోరు సలిపాను. అతడు మహావీరుడు. నా ఆగడం భరించలేక ఇంద్రాస్త్రం సంధించాడు. అప్పుడూ ప్రాణ భయంతో పారిపోయాను. ఆ తర్వాత దుర్యోధనుడు నన్ను

ప్రతిమాలగా ఘటోత్కచుడితో మాయా యుద్ధంతో తలబడ్డాను. పోరు హోరాహోరీగా సాగింది. ఇద్దరమూ మాయా యుద్ధనిపుణులమే. చివరికి ఘటోత్కచుడు 'మహామాయా' ఉపాసనా శక్తితో మనో మాయా విద్యను ప్రయోగించి నన్ను వధించాడు. అయ్యా.. యీ శరీరం అప్పటిది కాదు. ఈ శరీరం ఇప్పటిదే, ఈ యుగంలో నా తండ్రి పేరు నరసింహ భరద్వాజాచార్యుడు. ఆయన యీ 'అలంబస' నామాన్ని నాకు ఎందుకు పెట్టాడో నాకు తెలీదు." ఆగాడు అలంబసుడు.

"ఓహ్.. నిజమా? నిజమేనా? మీరు అభిమన్యుడితోనూ నాగరాజ వంశీయుడు ఇరావంతుడితోనూ యుద్ధం చేశారా? ఘటోత్కచుని ఎదిరించి నిలిచి అతనితో వధింపబడ్డారా?" అత్యాశ్చర్యంతో అడిగాడు అనీషుడు.

"అయ్యా. అది నా పూర్వజన్మ. ఆ జన్మ రహస్యం నాకు తెలిసింది యీ మధ్యనే. తెలిసిన క్షణం నించీ గమనిస్తున్నా. అలా గమనిస్తూంటే తెలిసింది. మనం మార్చి మార్చి శరీరాల్ని ధరిస్తున్నామనీ, ఆత్మలు మాత్రం అవేనని. " నిట్టూర్చి అన్నాడు అలంబసుడు.

అమ్మ వారి ముఖం నేల దీపాల వెలుగుతో వెలిగిపోతోంది. పదిహేడు చేతుల్లోని ఆయుధాలూ జీవం పోసుకున్నట్లు మెరుస్తుండగా, అభయహస్తం మాత్రం శాంతినీ ప్రేమనీ ప్రసాదిస్తోంది.

"అలంబసా... నీ కథ గొప్పదే, ఒక కలగన్నవాడు ఆ కలే నిజం అని భ్రమించినట్టుగా నువ్వు నిన్నే భ్రమలో పెట్టుకుంటున్నావు. ఏనుగు బొమ్మను తడిపి ఒంటి బొమ్మ చేశాక ఒంటి రూపే ఉంటుంది గానీ ఏనుగు రూపు కాదు. అదీగాక ఓ ఏనుగు మనసుని ఒంటి మనసులో ప్రవేశపెడితే ఒంటె ఏనుగు కాగలదా? ఏనుగులా ఘీంకరించి ఏనుగులా బలాన్ని ప్రదర్శించగలదా? నీ పూర్వజన్మ రహస్యాన్ని నీకు తెలిపిన వారెవరో నాకు తెలీదు గానీ, నిన్నా మహాభారత కాలపు అలంబసుడితో పోల్చి వర్ణించడం నీకు నచ్చింది. అదే గాఢంగా నీ మనసులో ముద్రించుకుపోయింది. ఇప్పుడు వేసుకోవలసిన ప్రశ్న గతజన్మ ఉన్నదా లేదా అని కాదు. మనం చేయాల్సిన కార్యాన్ని సక్రమంగా చేద్దామా లేమా అని" నవ్వి అన్నాడు అరిదమనుడు.

అలంబసుడు అతని ముఖాన్ని ఓ క్షణం సుదీర్ఘంగా చూసి, నవ్వి, "అవును ఇప్పుడు చెయ్యాల్సిన కార్యాన్ని ఇప్పుడే చెయ్యాలి. ఈ మాట అన్నదీ భీష్ముడే అదీ అంపశయ్య మీద పడుకుని, రాజధర్మాలగురించి తెలుపుతూ ధర్మరాజుతో అన్నాడు. సరే అరిదమనా. అరుగో సంకల్పానంద.. పద.. సంపూర్ణ దివారాత్ర పూజ మొదలెడదాం" లేచాడు అలంబసుడు.

అక్కడ ఉన్న వాళ్ళ మనసుల్లో ఎన్నో ప్రశ్నలు. సాగుతున్న చర్చని అర్థంతరంగా ఆపినందుకు కొంతమందికి అరిదమనుడి మీద కోపం కూడా వచ్చింది.

"ఆహా.. ఇప్పుడు గనక ఇక్కడ శృంగి వుంటే అతని కుతూహలానికి అంతువుండేది కాదుగదా" మనసులోనే శృంగిని తలచుకుని నవ్వుకున్నాడు మట్టు. రాత్రిలో ఏదో మార్పు వుంది. ఆ మార్పు తెలిసీ తెలీనట్టు వుంది. ఏదో వింతగా, ఏదో సంకోచంగా ఏదో సందేహంగా వుంది. గాలిలో కూడా విపరీతమైన అలజడి తెలుస్తోంది" చుట్టూ పరికించి అన్నాడు నీలుడు.

వర్షం... భీకరంగా కురుస్తోంది. కలుగుల్లోని జీవులు రక్షణకోసం పరుగులు పెడుతున్నాయి. పాములు చరచరా పాకి పుట్టల్లోంచి పైకొస్తున్నాయి. కుందేళ్ళు పరుగులతో ఎండుటాకుల గలగలలకు బదులు తడిసి పోయిన మెత్తని ఆకుల సవ్వడి తెలుస్తోంది. వాన హోరుతో కలిసి పై కొమ్మల మీంచి కింద కొమ్మల మీదికీ, ఆ కింది కొమ్మల మీంచి ఇంకా కింది

కొమ్మల మీదికి వర్షపు చినుకులు రాలుతూ, ధారలుగా మారుతూ ఓ విచిత్ర వర్ష సంగీతాన్ని సృష్టిస్తున్నాయి. సన్నగా మొదలైన కొలువులో ఇప్పుడు ఉధృతంగా శబ్దంతో నీటిని ప్రవహిస్తున్నాయి. మిట్ట మధ్యాహ్నం అయినా సూర్యుడెక్కడో గాఢమైన నీలి (వర్ష) మేఘాల వెనకన చిక్కుకుని వసివాడిపోయాడు. అందుకే అడవంతా సాయం సంధ్య చివరిలో వుండే చిరువెలుగుని మాత్రమే ప్రదర్శిస్తూ ఓ నిశ్శబ్దాన్నీ, ఓ ఒంటరితనాన్నీ సంతరించుకుంది. ఆ నిశ్శబ్దం అడవిది కాదు. అడవిలోని సమస్త జీవులదీ. భయంకరమైన మెరుపులు మొదలయ్యాయి. మెరుపులతోపాటు ఉరుములు. ఎంతగా అంటే, అడవి ఒక్క క్షణం మెరిసి మరో క్షణం మూసి, మరో క్షణం మెరిసిపోతోంది. ఉరుముల శబ్దాలపని చెప్పక్కర్లేదు.

వర్షం మరీ పెద్దదయింది. కొండలమీంచి వాన నీరు జలపాతాల్లా లోయల్లోకి పెద్ద శబ్దంతో జారుతోంది. కొన్ని కొన్ని కొండరాళ్ళ అంచులు విరిగి, దొర్లుకుంటూ లోయల్లో పడుతున్నాయి. గూళ్ళలోని పక్షులు గుబులుగా అరుస్తున్నాయి. ఆ వానలో ఎగరడానికి రెక్కల బలం చాలదు. రెక్కలు తడిస్తే శరీర భారం రెండింతలవుతుంది జడివానకి తోడు సుడిగాలి మొదలైంది. హోరు హెచ్చింది. మెరుపులకీ ఉరుములకీ తోడు పిడుగులు జత కలిశాయి. పిడుగు శబ్దాలతో అడవి దద్దరిల్లిపోతోంది. కొండ గుహల్లో ఉన్న జీవులు గుహల్లోపలే భయంగా తిరుగుతున్నై. వాటి బిడ్డలు తల్లుల పొట్టల్లో దూరడానికి ప్రయత్నిస్తున్నాయి. వాటిలో ఓ తెలీని భయం. కొన్ని మహా వృక్షాలు కూలి వాటి కొమ్మల మధ్య ఉన్న గూళ్ళు చెదిరి చితికి పక్షులు విగతజీవులవుతున్నాయి.

ఓ సుదీర్ఘమైన ఉరుముల మెరుపుల మేళా. ఆకాశం ముక్కలై నేలకు రాలుతుందా అన్నంత భీభత్సం. అర్జునుడి రధాన్ని శ్రీకృష్ణుడు పరమ వేగంతో నడుపుతూ పిడుగులు రాలుస్తున్నాడా? అన్నంత అపూర్వ విధ్వంసం. పిడుగులే పిడుగులు.

అమ్మవారి ఆలయంలో వందకి పై బడి జనాలున్నా నిశ్శబ్దం అలముకుంది. ఊహించని వర్షం ఇది. ఊహించని విధ్వంసం ఇది. ఆలయమూ పరిసరాలూ చెక్కుచెదరలేదు. ఆలయగోపురమూ, ఆలయ ప్రాంగణమూ ఎవరో దేవతలు గంధర్వులూ యక్షులూ కింపురుషులూ కలగలసి మహా కుంభాభిషేకం చేస్తున్నారా అన్నట్టుగా ధారలు జాలువారుతున్నాయి. కొలను పూర్తిగా నిండిపోయింది. ప్రాంగణంలో వేసిన ముగ్గుని వర్షం ఎప్పుడో తనలో కలిపేసుకోగా, లోపల వేసిన ముగ్గుమాత్రం నేతి దీపాల వెలుగులో దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది.

అలంబస అరిదమనులు చేష్టలుడిగి చూస్తున్నారు. సంకల్పానంద నిశ్చలంగా వీరాసనంలో కూర్చుని ఉన్నారు. అనీషుడు వర్షరాణి విన్యాసాల్ని తిలకిస్తున్నాడు. "నా జీవితంలో ఇటువంటి ప్రకృతి విలయాన్ని చూడలేదు. ఈ వర్షం కొట్టిన దెబ్బకు అడవి తల్లి కోలుకోవడానికి చాలాకాలమే పడుతుంది" గుసగుసగా అన్నట్టు వినిపించింది నీలుడు నీరస స్వరం మట్టుకి.

"అవును. అడవి రూపురేఖలు మారిపోయి ఉంటాయి. అయినా విలయమూ విధ్వంసమూ సాగుతూనే ఉందిగా!" నిర్వేదంగా అన్నాడు మట్టు.

వర్షం తన ప్రతాపాన్ని కాస్త తగ్గించినట్టే తగ్గిస్తూ పదిరెట్ల బలంతో మళ్ళీ విరుచుకుపడుతోంది. ఉండీ ఉండీ పడుతున్న పిడుగులు ఒక్కసారి పేట్రేగిపోయి ఉరుములతో మెరుపులతో ప్రళయరాగాన్ని ఆలపిస్తున్నాయి. చాలా పొద్దు మిగిలి వుండగానే చీకటి అలుముకుంది. పొద్దున వండిన పదార్థాలనే ఆరగిస్తున్నారు జనాలు. ఏపాటు తప్పినా యీ పాటు తప్పదు గదా.

"అలంబసా.. నీ గతజన్మ గురించి మళ్ళీ కాస్త చెప్పొచ్చుగా!" కుతూహలంతో అడిగాడు అనీషుడు.

"అనీషా, ఇంతకాలమూ జరిగిన పూజ, అదీ నిర్విఘ్నంగా జరిగిన పూజ, ఆఖరి ఘడియల్లో అర్ధంతరంగా ముగియడం ఎందుకో తెలుసా?" అనీషుడి కుతూహలానికి అడ్డుకట్టవేసి అన్నాడు అరిదమనుడు.

"ఎందుకు? ఈ వర్షప్రభావమేకదా. అప్పటికప్పుడు తవ్వి తియ్యాల్సిన కొన్ని ప్రత్యేక దుంపలనీ, ఎండుకట్టెలనీ, కొన్ని రకాల చెట్ల బెరళ్ళనీ మనం యీ వర్షంవల్ల సంపాదించుకోలేకపోయాం. ప్రకృతి వైపరీత్యాలు మానవుడి చేతుల్లో వుండవు కదా!" కనుబొమలు ముడిచి అన్నాడు అనీషుడు.

"పైకి కనిపించే కారణాలు అవి. అసలు కారణం అదికాదు. అభిమన్యుడి, ఘటోత్కచుడి, భీష్ముడి, దుర్యోధనుడి ఆత్మల్ని ఎప్పుడు నీవు స్మరిస్తావో అప్పుడు వారి తాలూకు ప్రకంపనలు ఏ ప్రదేశం నించి నువ్వు స్మరిస్తావో ఆ ప్రదేశానికి చేరుతాయి. ఇది చర్చలతో రుజువు పరిచే వ్యవహారం కాదు. అన్ని నిజాలూ రుజువుల చేత గుర్తింపబడవు" ఆగాడు అరిదమనుడు.

"నిజమే అరిదమనా! నిజమే. నా గత జన్మ రహస్యాన్ని చెప్పాక నా మనసు నా ఆధీనంలో పూర్తిగా లేదు. కురుక్షేత్రపు ఆనాటి మాయా యుద్ధం, ఆ యుద్ధంలో ఉపయోగించిన అస్త్ర శస్త్రాలు, ఆయుధాలు, వ్యూహాలూ అన్నీ మనసులో తిరుగుతూనే వున్నాయి. ఒక పక్క మంత్రోచ్చారణ చేస్తూనే మరో పక్క నా మనసు ఆ మహా కురుక్షేత్రంలో తిరగడం ప్రారంభించింది. అంతెందుకూ.. ఆ ఉరుములూ మెరుపులూ పార్ధసారధి రథచాలన శబ్దాలే. ఆ పిడుగులు వాయువ్య, వరుణ, ఆగ్నేయ, ఇంద్రస్త్ర, సూర్యాస్త్ర, నాగాస్త్ర, గరుడాస్త్ర ప్రయోగ ఫలితాలే. ఓయీ.. ఎందుకు నా మనసు చలించిందీ? నిశ్చలమైన మనసులో చేయవలసిన యజ్ఞం ఎందుకు కేవలం నా మనో చాంచల్యం వల్ల ఆగిపోయింది." తలవొంచుకుని దీనంగా అన్నాడు అలంబసుడు.

"బాధపడకు అలంబసా.. దీనికీ ఓ అర్ధం ఉండే ఉంటుంది. కాలమనే రచన మానవ నిర్మితం కాదు. దైవ లిఖితం" ఓదార్చాడు అరిదమనుడు.

ఫెళ ఫెళా ఉరుము. వెనువెంటనే భయంకరమైన పిడుగు వందలకొద్దీ మెరుపులు. ఏ కొండరాయో ఫటాల్న పగిలి రవ్వలు రవ్వలుగా కంకర పైకి విరజిమ్మింది. అనంతమైన వెలుగు. నేలమీంచి ఆకాశాన్ని చుంబిస్తున్నదా అన్నంత వెలుగు ఓ అరనిమిషంపాటు వెలిగి, క్షణాల్లో అంతా సద్దుమణిగింది.

"యజ్ఞం వికటించలేదు అలంబసా ఫలించింది. ఏదో భూమిని చీల్చుకుని పైకొచ్చింది ఏ మెరుపు దేవుడి హస్తాలో మనకి ఫలాన్ని అందించాయి. అయితే అదేమిటో మనం రేపు శోధించాలి. వెలుగు ప్రసరించిన చోటుని గుర్తించాలి. అక్కడ ఏముందో పరిశీలించాలి" కళ్ళు మెరుస్తుండగా చెప్పారు సంకల్పానంద.

"ఎలా చెప్పగలరు స్వామీ?" అడిగాడు అనీషుడు.

"అనీషా.. కళ్ళకి గోచరించినదాన్ని విశ్లేషిస్తే, నీ మనసు అదేదో స్థిరపరుస్తుంది. నా మనసుకు అది తెలుసు. హాయిగా అమ్మవారికి హారతిచ్చి 'శయన' అంటే పవళింపు సేవ చేద్దాం. ఈ రాత్రి ఇంకేమీ జరగదు. ఏ జంతువులూ, విషప్పురుగులూ, ఆత్మలూ, విరోధి గణాలూ యీ ఆలయ ప్రాంగణంలో అడుగుపెట్టలేవు. జగన్మాత రక్ష రెండు చేతులూ ఎత్తి అమ్మవారికి నమస్కరించి అన్నారు సంకల్పానంద. ఒక నిర్భయత్వమనే చిరుగాలి అందరినీ స్పృశించింది.

''ఇట్సాల్ ఎండెడ్'' లేచి కూర్చుని అన్నాడు రాబీ.

''వాట్ ఎండెడ్?'' ఇంగ్లీషులోనే అడిగారు శాస్త్రిగారు.

''ఒక విధ్వంసకరమైన, భీతావహమైన ఎపిసోడ్ పూర్తి అయింది. భూమి ఓ అద్భుతాన్ని ప్రసవించింది. నేనే సాక్షిని. మైగాడ్. ఏనాడూ కనీసం ఊహించను కూడా ఊహించలేదు'' అమెరికన్ యాక్సెంట్ ఇంగ్లీషులోనే అన్నాడు రాబీ.

''అదే అడుగుతున్నాను.. ఏదీ?'' అని.

''చూశాను. కానీ చెప్పలేను. విన్నాను. కానీ వివరించలేను. ఇందుకేనేమో నేను అమెరికానించి ఇండియాకి వచ్చింది. ఐ మస్ట్ టాక్ టూ మై బ్రదర్ ఎండ్ మై నికోల్'' లేచి ఒళ్ళు విరుచుకుంటూ అన్నాడు రాబీ.

అక్కడంతా కొండలూ రాళ్ళూ. ఇరవై ఒక్కమంది ఫకీర్లు పదకొండు గొర్రెల్ని బలి ఇచ్చారు. ఆ రక్తంతో రాళ్ళు తడిసిపోయాయి. పైన గద్దలు ఎగురుతున్నాయి. ఎవరో ఓ ముసలిదీ పిల్లాడూ వచ్చారు.

''దానం చెయ్యండి బాబూ'' అని. ఫకాల్న నవ్వారు ఇద్దరు ఫకీర్లు.

''ఓ ముసలీ.. మేమే ఫకీర్లం. అంటే బికార్లం. మేము నీకు దానం చేసేది ఏముంటుంది? అవిగో యీ ఆహారం కేవలం ఆ గద్దలది. ఇవి తిన్నాక ఏం జరుగుతుందో తెలుసా? ఆ గద్దలు నలుదిక్కులకీ ఎగిరిపోతై. మగగద్దలతోజోడు కడతై. ఈ మాంస ప్రభావం వల్ల ఇనుప ముక్కు గద్దలు వాటికి పుడతై. ఆ ఇనుప ముక్కువి ఏ జంతువుని ముక్కుతో పొడిచి రక్తం కార్చినా, ఆ జీవి విషయమైపోతుంది. ఆ జీవుల్ని ఎవరు తిన్నా వారికి విధ్వంసకులు పుడతారు. రక్త బీజుడి కథ వినలేదూ? అలాగన్నమాట. ఆ విధ్వంసకులు సర్వ ప్రపంచాన్నీ తమ చేతుల్లోకి తీసుకుంటారు. అప్పటికిగానీ మా యుగయుగాల స్వప్నం ఫలించదు. ఆ మాంసంలో అతి చిన్న ముక్క మీరు తిన్నా, మరుక్షణమే ఒకర్నొకరు పొడుచుకు చస్తారు. వీడెవడూ, నీ మనవడా? వాడ్ని మాతో పంపించు మాలాంటి శక్తిమంతులుగా వాడిని తయారు చేస్తాం. నీదగ్గర వుంటే ఏం లాభం? బిచ్చగాడవుతాడు'' ఓ ఫకీరు అన్నాడు.

ముసల్దీ, బిడ్డడూ పారిపోయారు. వాళ్ళని చూస్తూ పకపకా నవ్వారు పకీర్లు. పకీర్లు కొంచెం దూరం పోగానే గద్దలు విపరీతమైన వేగంతో వచ్చి గొర్రెల్ని కాళ్ళ మధ్య ఇరికించుకుని తలో దిక్కుకీ ఎగిరిపోతున్నాయి. గొర్రెలు చిందించే రక్తం నేలమీద వున్న ముళ్ళ మొక్కల మీద పడుతోంది. ఆ మొక్కలు రక్తాన్ని ఆబగా ఆస్వాదిస్తున్నాయి. బలి ఇచ్చిన చోటుకి చీమలు, పాములూ, బల్లులూ ఇతర కీటకాలూ పాక్కుంటూ పోయి ఆత్రంగా రక్తాన్ని నాలికలతో నాకుతున్నాయి. దానిలో పొర్లుతున్నాయి. వాటిలో ఏదో మార్పు.

''ప్రతి ప్రళయమూ ఒక శాంతిని పుట్టించేదే''

''ప్రతి శాంతీ ఒక సమరాన్ని సృష్టించేదే''

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments